క్లుప్తంగా

నల్లగొండలో మొదటిసారిగా ఓపెన్ హార్ట్ సర్జరీ



సర్జరీ అనంతరం పేషంట్‌తో డాక్టర్లు

నల్లగొండ : పట్టణంలోని రివర్ నిమ్స్ ఆసుపత్రిలో మొదటిసారిగా ఓపెన్‌హార్టు సర్జరీని వైద్యుల బృందం నిర్వహించారు. కార్డియాలజీ విభాగంలో రెండున్న సంవత్సరాలుగా జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలను అందిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. శనివారం నల్లగొండ మండలంలోని మేళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన వి.శంకరయ్య గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చేరాడు. దీంతో అతడికి డాక్టర్ పవన్‌తేజ, డా.అజిత్‌శర్మ బృందం కలిసి ఓపెన్ హార్టు బైపాస్ సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు, ప్రస్తుతం శంకరయ్య ఆరోగ్యంగా ఉన్నట్లు వారు తెలిపారు.

సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు



విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ స్పందన

మర్రిగూడ : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో జనుము, జీలుగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారిణి ఆవుల స్పందన తెలిపారు. శనివారం సహకార బ్యాంకులో గల విత్తనాలను ఆమె పరిశీలించారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో సహకార బ్యాంక్ వద్ద సంప్రదించాలని సూచించారు. జనుము 40కిలోల విత్తనాల బ్యాగ్ రూ.1225, 30కిలోల జీలుగ విత్తనాలు సబ్సిడీపోను రూ.843 చెల్లించాలని తెలిపారు.

కృత్రిమ కాలు అందజేత



మాద పద్మకు కృత్రిమ కాలును అందజేసిన కిశోర్‌చాబ్రియా

నకిరేకల్ : పట్టణంలోని డాక్టర్స్‌కాలనీకి చెందిన మాద పద్మ షుగర్ వ్యాధితో కాలును కోల్పోయింది. దీంతో నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఫర్ ఆర్టిఫిషియల్ లింబ్స్ కిశోర్‌చాబ్రియా రూ.25 వేలు విలువ గల కృత్రిమ కాలును శనివారం అందజేశారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు బొల్లం శోభాకృష్ణమూర్తి పద్మకు రూ.1116లు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం క్లబ్ జోన్ చైర్మన్ రావిరాల అశోక్ నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి ప్రభాకర్, సూర్యచంద్రరావు, డిస్ట్రిక్ చైర్మన్ బొల్లం కృష్ణమూర్తి, ఎస్.రాంమోహన్ రావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

మర్రిగూడ : అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిందని రైతులు అధైర్య పడవద్దని తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. తడిసిన ప్రతిగింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లారీల కొరతను అధిగమించేలా చూస్తామన్నారు. ఆయన వెంట సీఈఓ శ్రీనివాస్, సిబ్బంది సాయి, మల్లిఖార్జున్, సందీప్ ఉన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల : తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొలను సునీత వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని చిట్యాల పీహెచ్‌సీ, వెలిమినేడు పీహెచ్‌సీలలో జన ఆరోగ్య సమితి సమావేశాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆసుపత్రుల అభివృద్ధి, నిర్వహణ అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సమావేశాలలో ఎంపీడీఓ బి.లాజర్, చిట్యాల, వెలిమినేడు పీహెచ్‌సీల వైద్యాధికారులు కిరణ్‌కుమార్, నర్సింహ, ఎంపీటీసీలు సత్తయ్య, సీతారమణారెడ్డి, సర్పంచ్‌లు మల్లమ్మపాపయ్య, పుష్పనర్సింహ పాల్గొన్నారు.

స్త్రీశక్తి భవనానికి మోక్షమెప్పుడో?

- 15ఏళ్లకు పైగా అద్దె భవనంలోనే సమావేశాల నిర్వహణ
- ఇరుకుగదుల్లో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



స్త్రీశక్తి భవన నిర్మాణానికి పన్నెండేళ్ల క్రితం వేసిన శిలాఫలకం



అద్దె భవనంలో నిర్వహిస్తున్న మండల సమాఖ్య కార్యాలయం

కేతేపల్లి : కూలీలకు పని కల్పించే ఉపాధిహామీ పథకం.. పేద మహిళలకు పొదుపు ద్వారా ఆర్థిక స్వాలంబన కల్పించే ఇందికా క్రాంతి పథకం.. ఈ రెండు శాఖల పరిపాలన ఒకే గొడుగు కిందకు తెచ్చే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భారత్ నిర్మాణ్ రాజీవ్‌గాంధీ సేవా కేంద్ర భవనం పేరిట స్త్రీశక్తి భవనాలకు రూపకల్పన చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మండల కేంద్రాల్లో వాటి నిర్మాణానికి 2010లో ఒక్కో దానికి రూ.25లక్షల చొప్పున ఉపాధిహామీ నిధులు మంజూరు చేసింది. జిల్లా అంతటా ఈ భవనాలు పూర్తయి ఆయా శాఖల నిర్వహణలు నూతన భవనాల నుంచే కొనసాగిస్తున్నారు. కానీ మండలంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇక్కడ భవన నిర్మాణానికి రెండు సార్లు నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు.

వెనక్కి వెళ్లిన నిధులు..

మండల కేంద్రంలో స్త్రీశక్తి భవన నిర్మాణానికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2011లో అప్పటి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నేతి విద్యాసాగర్ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భవన నిర్మాణానికి అధికారులు ముగ్గు పోసి వదిలేశారు. శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు, ముగ్గుపోసిన అధికారులు ఏళ్ల తరబడి నుండి భవన నిర్మాణం వైపు దృష్టి సారించలేదు. ఏళ్లు గడిచినా భవన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయి. తర్వాత మరోసారి (2016–17లో) రూ.32 లక్షల ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు భవన నిర్మాణ పనుల శంకుస్థాపనకు 2017జనవరిలో మరోసారి శిలాఫలకం ఏర్పాటు చేశారు. నాడు మండలంలో నెలకొన్న రాయకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆవిష్కరణ కార్యక్రమం కూడా నిర్వహించలేదు. ఇలా రెండోసారి నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో 15ఏళ్లకు పైగా మండల సమాఖ్య నిర్వహణ అరకొర వసతులు ఉన్న అద్దె భవనంలోనే కొనసాగుతుంది.

అద్దె భవనంలో అవస్థలు..

మండలంలోని 16గ్రామపంచాయతీలు, ఆవాస గ్రామాల పరిధిలో మంది 8,580 మంది సభ్యులతో 865సమభావన సంఘాలు, 25 సంఘబంధాలు ఉన్నాయి. ఈ సంఘాల్లోని సభ్యులకు పొదుపు చేసుకోవడం, బ్యాంకు నుంచి రుణాలు పొందడం తిరిగి వాటిని చెల్లించటం తదితర అంశాలపై ఆయా సంఘాల నిర్వాహకులకు ఐకేపీ సిబ్బంది ఎప్పటికప్పుడు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయితే సొంత భవనం లేకపోవడంతో అరకొర వసతులు ఉన్న అద్దె భవనంలోనే మండల సమాఖ్య కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో వెలుగు సిబ్బంది ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్త్రీశక్తి భవన నిర్మానానికి నిధులు మంజూరు చేసేలా అధికారులు మరోసారి ప్రతిపాదనలు పంపించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



వెలుగు కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాము. ప్రతి నెలా మహిళా సంఘాల సభ్యులతో సమావేశాల నిర్వహణకు ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో నిర్వహించాల్సివస్తుంది. ఈ విషయాన్ని గతంలోనే ఎంపీడీఓ కార్యాలయ అధికారుల నుంచి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము.

– బి.యాదమ్మ, ఐకేపీ ఏపీఎం, కేతేపల్లి

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులను ప్రభుత్వం సిద్ధంగా ఉంచిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు విత్తనాలను, ఎరువులను నకిలీవి అమ్మేందుకు ప్రయత్నిస్తే పోలీసులు పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తారని, ఇప్పటికే నకిలీ విత్తన విక్రయదారులను గుర్తించేందుకుగాను జిల్లా స్థాయి, మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పోలీస్ శాఖ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీ చేస్తున్నారని అన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే రైతులు విత్తనాలను, ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, మాజీ ఎంపీటీసీ జనగాం నర్సింహాగౌడ్, రవీందర్ ఉన్నారు.



నార్కట్‌పల్లి : ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లింగయ్య

బీఆర్ఎస్‌తోనే విద్యుత్ సమస్య పరిష్కారం

నార్కట్‌పల్లి : తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యాయని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 6వ వార్డులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. మండల కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టే మల్లిఖార్జున్‌రెడ్డి, ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, పావని శ్రీధర్, వాజీద్, భాస్కర్‌రెడ్డి, రవి, బయన్న, హేమంత్ తదితరులున్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

నల్లగొండ టౌన్ : ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 34రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మె పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని, లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అఖిలభారత న్యాయవాదుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల శంకరయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సమ్మె నిర్వహిస్తున్న ఐకేపీ వీఓఏ ఉద్యోగులకు సంఘీభావంగా శనివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, సమన్వయకర్తగా వ్యవహరించారు. సమావేశంలో బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండా శ్రీశైలం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జమాలుద్దీన్, ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్యాంసుందర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశం, సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు నజీరుద్దీన్, సరోజ, రవీందర్, సత్యనారాయణ, నరసింహ, సైదాచారి, సుందరయ్య, మారయ్య, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నల్లగొండ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ అన్నారు. సీఎం కేసీఆర్ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించడాన్ని హర్షిస్తూ శనివారం పట్టణంలోని గడియారం సెంటర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కులగణన చేయడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందని ఆరోపించారు. రోహిణీ కమిటీ రిపోర్టు పేరుతో కుల గణన చేయకుండా కాలయాపన చేస్తుందని, కులవృత్తులకు పూర్వ వైభవం తెచ్చేవిధంగా కేసీఆర్ ప్రభుత్వం అన్ని విధాలా ఆర్థికసాయం చేస్తు ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుకరాజు చెన్నయ్య, నాయకులు పగిళ్ల సైదులు, నాంపల్లి శ్రీనివాస్, నోముల రవి, కృష్ణయ్య, బ్రహ్మాచారి, వెంకన్న, శ్రీకాంత్, డి.శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రీనివాస్, యాదగిరి, నాగరాజు, విజయ్, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపురంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



దీక్షలో కూర్చున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శనివారం 30వ రోజు కొనసాగింది. దీక్షలో గ్రామ శ్రీఅయ్యప్ప లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని తమ మద్దతు పలికారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు కాటం రాజు, నక్క గణేష్, యాదిరెడ్డి, దుర్గయ్య, శ్రీను, వెంకటేషం, సైదులు, సాగర్, కృష్ణయ్య, వెంకన్న, లింగస్వామి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రామగిరి(నల్లగొండ) : ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగిఉండాలని గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్‌తో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. శనివారం తిప్పర్తి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ ప్రదీప్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్‌బాబు మాట్లాడుతూ.. గుండెపోటు సమయంలో సీపీఆర్ చేయడంతో గుండెకు ఆక్సిజన్ అందుతుందని దీంతో ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగుల వంచ విజయలక్ష్మిలింగారావు, సర్పంచ్ రొట్టెల రమేష్, డాక్టర్ అరుణ, సిబ్బంది సోమయ్య, శేషాదేవి, భాగ్యలక్ష్మి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం



పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న డీఈఓ

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని డీఈఓ భిక్షపతి అన్నారు. శనివారం కట్టంగూర్ మండలంలోని ఈదులూరులో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 'మన ఊరు మన బడి'కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో హెచ్‌ఎంలు, సర్పంచ్‌లు, ఎస్ఎంసీ చైర్మన్లతో పాఠశాలల్లో అభివృద్ధి పనులపై సమీక్షించారు. పనులు వేగవంతం చేసి ఈనెల 31వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, ఎంపీడీఓ పోరెళ్ల సునీత, ఎంపీఓ అథర్ ఫర్వేజ్, ఎంఈఓ మేక నాగయ్య, ఏఈ వెంకటనర్సయ్య, సర్పంచ్ నారాయణగౌడ్, సీఆర్‌పీలు రవికుమార్‌గౌడ్, అంబర్ల సత్యనారాయణ, పి.నాగేష్, లింగస్వామి, కొప్పు గోవర్ధన్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ప్రకాశంబజార్‌లో గల సంకల్ప మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఈనెల 22న సోమవారం ఆస్పత్రిలో పాత్రికేయులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ కరీముల్లా, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ రఘుతేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత్రికేయులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగదేవమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కనగల్ : మండల పరిధిలోని చర్లగౌరారంలో గంగదేవమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకుడు పిల్లి రామరాజు పాల్గొని ప్రత్యేక పూజాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల యాదగిరి, మాజీ ఎంపీటీసీ బోయపల్లి జానయ్య గౌడ్, మాజీ సర్పంచ్ చిలకరాజు వెంకన్న, చింతల బ్రహ్మయ్య, ఉపేందర్, మురళీ పాల్గొన్నారు.

వాహనదారులకు మజ్జిగ పంపిణీ

కేతేపల్లి : 65 నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని కొర్లపహాడ్ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీఎమ్మార్ ఉద్యోగి రమేష్ సహకారంతో శనివారం 400మంది వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధి సతీష్, టోల్ మేనేజర్ శివకుమార్, రవితేజ, నాగకృష్ణ పాల్గొన్నారు.

పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 24వ వార్డులో పొడి చెత్త, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో వార్డు స్పెషల్ అధికారి, కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ పాల్గొని రెడ్యూస్, రియూస్ రీసైకిల్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు రిసోర్స్‌పర్సన్ వంటపాక అండాలు, కత్తుల యాదగిరి, పోడి యాదగిరి, రాధ, అనూష, జయమ్మ, పార్వతమ్మ, సరిత, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఆయన అభిమానులు నిర్వహించారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని గ్రామభారతి ఆవాసంలో సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా వేముల నర్సన్న ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యాదవ, కుర్మ నాయకులు



దున్నపోతుతో రేవంత్ దిష్టిబొమ్మను తొక్కిస్తున్న యాదవ, కుర్మ జేఏసీ నాయకులు

నల్లగొండ టౌన్ : యాదవులను, యాదవ కులవృత్తిని కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే వెనక్కితీసుకోవాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ డిమాండ్ చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం పట్టణంలోని గడియారం సెంటర్‌లో యాదవ, కుర్మల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సదర్ పండగ సందర్భంగా హైదరాబాద్ నుంచి తెప్పించిన దున్నపోతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దున్నపోతులతో రేవంత్ దిష్టిబొమ్మను తొక్కించి తమ నిరసనను తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ.. కులవృత్తులను ఆదరిస్తున్న ప్రభుత్వం మాదని, కులవృత్తులను కించపరిచే విధంగా మాట్లాడిన రేవంత్ యావత్ యాదవ సామాజిక వర్గానికి వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. మత్స్యకారులను, ముదిరాజ్‌లను ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం ముందుందన్నారు. మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌పై చేసిన వ్యాఖ్యలను ఈనెల 24వ తేదీలోగా రేవంత్‌రెడ్డి వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పకపోతే 25న గాంధీభవన్‌ను ముట్టడిచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాదవ, కుర్మల జేఏసీ రాష్ట్ర నాయకులు డి.రాజారాంయాదవ్, రాష్ట్ర కన్వీనర్ కడారి అంజయ్యయాదవ్, రాష్ట్ర కోకన్వీనర్ లొడంగి గోవర్ధన్‌యాదవ్, సోమనబోయిన సుధాకర్‌యాదవ్, నూక కిరణ్‌యాదవ్, సాదం సంపత్‌యాదవ్, చీర పంకజ్‌యాదవ్, గుండెబోయిన అయోధ్యయాదవ్, మచ్చర్ల ఏడుకొండలు, ఓయూ జేఏసీ చైర్మన్ నక్క శ్రీశైలంయాదవ్, వెంకటేశం, బాలరాజు, చందువంశీ, పద్మ, నాగరాజు, జానయ్య, శ్రీనివాస్, శివకుమార్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్

శాలిగౌరారం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ఎస్ఐ సతీష్ అన్నారు. మండలంలోని తక్కెళ్లపహాడ్‌లో శనివారం రాత్రి పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, సోషల్ మీడియా, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై కళాజాత ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం వ్యవసాయ పంటలు చేతికి వచ్చి డబ్బులు రైతులు ఖాతాలో జమ అవతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు మాయమాటలతో నేరాలకు పాల్పడే అవకాశమున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలను అపరిచిత వ్యక్తులకు తెలియపరచొద్దని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో మూఢనమ్మకాలకు ప్రభావితం కావద్దని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



ఉపాధి కూలీలలో మాట్లాడుతున్న చినవెంకులు

కేతేపల్లి : కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను కలిసిన ఆయన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ చట్ట పరిరక్షణలో భాగంగా ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను కూలీలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ల పేరుతో పట్టణాల్లో విలీనం చేసిన గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కల్పించకపోవడంతో అక్కడి నిరుపేద కూలీలు ఉపాధి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయం కార్మిక సంఘం మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, కూలీలు దుర్గయ్య, రజిత, వసంత, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని మోడల్ జూనియర్ కళాశాలలో 2023–24 సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. www.tsmodelschool.com నందు మే 25వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాలికలకు ఉచిత హాస్టల్ సౌకర్యం ఉందన్నారు.

రైతు బంధు సమితి మండల అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి రైతు బంధు సమితి మండల అధ్యక్షుడిగా, మరో 20మంది డైరెక్టర్‌లుగా నియమితులయ్యారు. దీంతో అధ్యక్షుడిగా నియమితులైన సుధాకర్‌రెడ్డి శనివారం నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లింగయ్యను కలిసి జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సైదులు, అయిలయ్య, వెంకటేష్‌గౌడ్, శ్రీశైలం, మచ్చేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీల పేరుతో డబ్బులు వసూళ్లు

- ఒక్కో రైతు ద్వారా రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్న కేంద్రాల ఇన్‌చార్జ్‌లు
- పట్టించుకోని అధికారులు



కల్వలపల్లి కొనుగోళ్లు కేంద్రంలో నిల్వఉన్న ధాన్యం రాశులు

మునుగోడు : తెలంగాణ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో కేంద్రం నిర్వాహకులు వివిధ కారణాలతో డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. వారం, పది రోజుల క్రితం వరకు తేమ శాతం అధికంగా ఉందని, తాళ్లు అధికంగా ఉందనే సాకుతో ఒక్కోక రైతు నుంచి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు వసూళ్లు చేశారు. ఏ రైతు డబ్బులు ఇవ్వరో ఆ రైతు ధాన్యం తూకం వేయకుండా రోజుల తరబడి ఉంచడంతో కొందరు రైతులు తప్పని పరిస్థితిలో డబ్బులు ఇచ్చి తమ ధాన్యం అమ్ముకుంటున్నారు. తీరా ధాన్యం కాంటాలు ముగిసే సమయానికి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు మిల్లులకు తరలించేందుకు లారీలు రావడం లేదని, ప్రభుత్వం ఇస్తున్న కిరాయితో పాటు అదనంగా రైతులు ఇస్తేనే లారీలు వస్తున్నాయని చెబుతూ ఒక్కోక రైతు వద్ద రూ.2వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అదే తరహాలో శనివారం మండలంలోని కల్వలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కేంద్రంలో దాదాపు 40మందికిపైగా ధాన్యం తూకం వేయాల్సి ఉండగా ఆ రైతులు అదనంగా లారీ కిరాయి డబ్బులు ఇస్తేనే తూకం వేస్తామని నిర్వాహకులు చెప్పడంతో కొందరు రైతులు డబ్బులు ఇచ్చి తమ ధాన్యం తూకం వేయించుకొని మిల్లుకు తరలించగా, కొంతమంది రైతులు ఇవ్వకుండా నిర్వాహకులను ప్రశ్నించడంతో ఆ రైతుల ధాన్యం తూకం వేయకుండా నిలిపివేస్తున్నారు. దీంతో నెలల తరబడి తమ ధాన్యం అమ్ముకునేందుకు దాదాపు 20మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి మిగిలిన రైతుల ధాన్యాన్ని కూడా తూకం వేయించాలని కోరుతున్నారు.

డబ్బులు ఇస్తేనే తూకం వేస్తున్నారు



ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీలు రావడం లేదని, ఒక్కోక రైతు రూ.వెయ్యి నుంచి రూ.3వేలు ఇస్తే తూకం వేసి పంపిస్తామని కేంద్రం వద్ద పనిచేస్తున్న వీబీకే చెప్పుతున్నాడు. నేను డబ్బులు ఇవ్వకపోవడంతో నా ధాన్యం నేటికి తూకం వేయలేదు. నెల రోజుల క్రితం కేంద్రానికి ధాన్యం తెచ్చానని, నా తరువాత ధాన్యం తెచ్చిన రైతు వద్ద డబ్బులు తీసుకొని తూకం వేశారు. అధికారులు చొరవ తీసుకొని ధాన్యం తూకం వేయించాలి.

– సుంకరబోయిన రాము, రైతు, కల్వలపల్లి